# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

❖ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ప్రవేశాలకు మే 25వ తేదీ వరకు ధరఖాస్తు గడువు.

❖ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్ ప్రవేశ పరీక్ష రేపు జరగనుంది.

❖ సింహాచలం శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారి చందనోత్సవ ఏర్పాట్లు పూర్తయ్యాయి.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈరోజు మంత్రి సభా ప్రాగణంలో పోలీసు అధికారులతో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రధానమంత్రి సభకు 6 వేల మంది పోలీసులతో భద్రతా చర్యలను చేపడుతున్నామని, అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతా చర్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

సింహాచలం శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారి చందనోత్సవం, నిజరూప దర్శనం రేపు జరగనుంది. ఈరోజు అర్ధరాత్రి స్వామి వారి చందనాన్ని తొలగించి నిజరూప దర్శనం కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. రేపు ఉదయం 6 గంటల వరకు అంతరాలయ దర్శనాలు కల్పిస్తారు. రేపు తెల్లవారు జామున 3 గంటల 30 నిమిషాల నుండి సర్వ దర్శనాలు ప్రారంభమవుతాయి. చందనోత్సవానికి దాదాపు 2 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు భావిస్తున్నారు. కొండపైకి వెళ్ళేవారికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.

క్యూలైన్ లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొండపైకి పరిమిత సంఖ్యలో అనుమతి ఉన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. 2 వేల మంది పోలీసులతో భద్రత చర్యలు చేపడుతున్నారు. చందనోత్సవ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 5 మంత్రులతో కమిటిని సైతం నియమించింది. వీరు ఏర్పాట్లను ఇప్పటికే పలుమార్లు సమీక్షించారు. కాగా చందనోత్సవం ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఈ రోజు పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇతర ఆలయ అధికారులతో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

====================

ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ సాధించేవరకు చేసిన ప్రయాణం అభినందనీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మద్యం వేదికగా తెలిపారు. ఎంతటి కష్టమైన లక్ష్యాన్ని అయినా ధైర్యం, అవిశ్రాంత కృషితో చేరుకోవచ్చునని రుజువు చేశారని చెప్పారు. దృఢ సంకల్పం ఉంటే ప్రతి అవరోధాన్ని అధిగమించి నూతన గమ్యాలను చేరుకోగలమని ఉదయ్ కృష్ణారెడ్డి కథ మనకు గుర్తు చేస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.

అదే విధంగా ఉదయ్ కృష్ణారెడ్డిని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా అభినందించారు. అఖిల భారత స్థాయిలో 350వ ర్యాంక్ సాధించడం పట్ల మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ వరకు ఎదిగిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు.

====================

అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వస్తున్న ప్రధానామంత్రి నరేంద్రమోదీ సభకు దాదాపు 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్ధనరెడ్డి తెలిపారు. ఈరోజు సభ ఏర్పాట్లను గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్షించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ... గుంటూరు పార్లమెంటు పరిధిలో సుమారు 2 లక్షలకు పైగా ప్రజలు హాజరు అవుతారని, వీరికి అవసరమైన బస్సులు, భోజనాలతో పాటు మంచినీరు సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

====================

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్ ప్రవేశ పరీక్ష రేపు జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష జరుగుతుంది. హాల్ టికెట్లను ఇప్పటికే polycet.nic.in వెబ్‌సైట్ లో పొందుపరిచారు. నేరుగా డౌన్ లోడ్ చేసుకుని విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలి. పరీక్షా కేంద్రాలకు గంట ముందుగా విద్యార్థులు చేరుకోవాలి. ఉదయం 11 గంటల తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించరని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, క్యాలిక్యులేటర్స్, స్మార్ట్ వాచ్ లను అనుమతించరు.

కాగా.. ఈ పరీక్షకు అనకాపల్లి పట్టణంలో 14 కేంద్రాలు, నర్సీపట్నం పట్టణంలో 9 కేంద్రాలు కలిపి మొత్తం అనకాపల్లి జిల్లాలో 23 కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త ఐయూఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో మొత్తం 9 వేల 022 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు.

విరామం

====================

తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకోవాలని ఆ విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకులు ఆచార్య పి.సువర్ణలతా దేవి తెలిపారు. తిరుపతిలో ఆకాశవాణితో ఆమె ఈరోజు మాట్లాడుతూ... 2025 సంవత్సరానికి ఏపి పిజి సెట్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సంయుక్త ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ ఈనెల 2వ తేదీన విడుదలైందని.. అపరాద రుసుం లేకుండా మే 5 వరకు.. అపరాద రుసుంతో మే 25వ తేదీ వరకు ధరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు cets.apsche.ap.gov.in వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అలాగే ఇతర వివరాలకు 0877-2284592 నెంబర్ కు సంప్రదించాలని సువర్ణలతా దేవి తెలిపారు.

====================

తిరుపతి జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే లైన్ లకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మాణానికి ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. జిల్లాలో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు  సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇస్తూ... వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

====================

భూముల సర్వే ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాయంలో 22 మండలాల రెవెన్యూ, సర్వే అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రీ సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రెవెన్యూ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. మ్యూటేషన్ ప్రక్రియలో జాప్యం చేస్తే ఉపేక్షించమని కలెక్టర్ అన్నారు. వ్యవసాయ భూములకు నీటి వినియోగం చేసే ప్రాంతంలో నీటి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డుల జారీ, సచివాలయాల నుంచి అందించే వివిధ సర్టిఫికెట్ల జారీ తదితర అంశాలపై సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు.

====================

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలో మావోయిస్టుల కదలికలపై నిర్దిష్ట సమాచారంతో కూబింగ్ నిర్వహించామని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ బర్దర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిన్న ఉదయం, మధ్యాహ్నం జరిగిన కూబింగ్ ఆపరేషన్ లో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య పరస్పర కాల్పులు జరిగాయని చెప్పారు. ఈ కూబింగ్ లో మావోయిస్టులు తప్పించుకోగా సంఘటన ప్రదేశం నుంచి SLR మ్యా గజైన్, కమ్యూనికేషన్ పరికరాలు, మావోయిస్టు సాహిత్యం, ఔషధాలు, కిట్ బ్యాగులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు.

====================

గిరిజన గురుకుల రెసిడెన్సియల్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఏ ఇన్ ఛార్జ్ ప్రాజెక్టు అధికారి ఎస్.ఎస్. శోభిక అన్నారు.

====================
====================